నమస్తే తెలంగాణ

నిర్మల్

5 | నిజామాబాద్, బుధవారం 28 ఫిబ్రవరి 2024 | NIRMAL


## పారిశుధ్య పనులను చేపట్టాలి..: డీపీవో శ్రీనివాస్



పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

దస్తురాబాద్, ఫిబ్రవరి 27 : పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బుట్టాపూర్, గొడిసేర్యాల, మున్యాల గ్రామ పంచాయతీలలో పర్యటించారు. నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, సెగ్రిగేషన్ షెడ్లు, రికార్డులు, పాఠశాలలు, మధ్యాహ్న భోజన బియ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, హరితహారం, పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలను రక్షించాలని సూచించారు. నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీవో అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు మల్లేశ్, సౌమ్య, రాజేశ్వరి ఉన్నారు.

## ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పూజలు



శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, ఫిబ్రవరి 27 : మండల కేంద్రంలోని కుంటాల జలపాతం రోడ్డు మార్గంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పూజలు చేశారు. మంగళవారం ఆలయ ప్రారంభోత్సవంతోపాటు విగ్రహ ప్రతిష్ఠాపన, కలశ పూజ నిర్వహించారు. ఇందులో భాగంగా శోభాయాత్ర నిర్వహించగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పెంట వెంకటరమణ, నాయకులు దేవేందర్‌రెడ్డి, సురేందర్, ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.



దిలావర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ కే శంకర్

# విజయీభవ

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- హాజరుకానున్న 13,345 మంది విద్యార్థులు
- సమస్యాత్మక కేంద్రాలపై నిఘా
- నిమిషం ఆలస్యమైన నో ఎంట్రీ..
- గంట ముందుగానే సెంటర్స్‌కు చేరుకోవాలి..

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 27: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నేటి నుంచి రెగ్యులర్, ఒకేషనల్ ప్రథమ సంవత్సరం, 29వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగనున్నాయి. మార్చి 16వ తేదీతో ముగియనున్నాయి. కాగా.. జిల్లావ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 13,345 మంది హాజరుకానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరంలో రెగ్యులర్ విద్యార్థులు 5,463, ఒకేషనల్ 1,072 మొత్తం 6,535 మంది.. ద్వితీయ సంవత్సరంలో రెగ్యులర్ విద్యార్థులు 5,772, ఒకేషనల్ 1,038 మొత్తం 6,810 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. వీరికి నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో 23 కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### పకడ్బందీగా నిర్వహణ

కేంద్రాల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 144 సెక్షన్ విధించారు. ముథోల్, భైంసాలో ఏర్పాటు చేసిన కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించి నిఘా పెంచారు. మండలానికి ఒకే కళాశాల ఉన్నచోట ఎనిమిది సెల్ఫ్ సెంటర్స్‌ను ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్ నిరోధానికి మూడు ఫ్లయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, పరీక్షల పర్యవేక్షణకు ముగ్గురు జిల్లాస్థాయి అధికారులు, ఇందులో డీఐఈవో, సీనియర్ ప్రిన్సిపాల్, సీనియర్ లెక్చరర్‌తో ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే 79979 94358 నంబర్‌కు ఫోన్ చేస్తే చర్యలు తీసుకుంటారు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష గదిలోకి అనుమతించరు. గంట ముందుగానే చేరుకోవాలి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

### పకడ్బందీగా నిర్వహిస్తాం..

**- పరశురాం, డీఐఈవో, నిర్మల్.**

విద్యార్థులకు హాల్ టికెట్లను జారీ చేశాం. హాల్‌టికెట్స్ ఇంటర్ నెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ప్రైవేటు కళాశాల యాజమాన్యాలను కూడా హాల్ టికెట్‌లను జారీ చేయాలని ఆదేశించాం. నెట్ సెంటర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరుకావచ్చు.

### ఆదిలాబాద్ జిల్లాలో 30 కేంద్రాలు..

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 27 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆదిలాబాద్ డీఐఈవో రవీంద్రకుమార్ మంగళవారం తెలిపారు. 30 కేంద్రాలను ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

# మిర్చి ధర ఢమాల్

- వారం రోజుల్లోనే పడిపోయిన ధర
- ఆందోళనలో రైతన్నలు.. విక్రయించేందుకు అవస్థలు..



మిరప కాయలను ఆరబోసిన రైతులు

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 27 : మిర్చి ఉత్పత్తులకు ధర రాకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. గతేడాది సాగు తక్కువగా ఉండి, దిగుబడి కూడా తక్కువగా రావడంతో ధర అధికంగా పలికింది. దీంతో ఈ యేడాది రైతన్నలు మిర్చి సాగుపై మొగ్గు చూపారు. నిర్మల్ జిల్లాలోని నిర్మల్, సారంగాపూర్, కుంటాల, కుభీర్, లక్ష్మణచాంద, లోకేశ్వరం, తానూరు, భైంసా మండలాల్లో 20 వేల ఎకరాలకు పైగానే మిర్చి సాగు అయినట్లు అధికారులు తెలిపారు. గతేడాది మాత్రం 5 వేల ఎకరాలకు మించి సాగు కాలేదు. అయితే ఈసారి ధర వస్తుందనే ఆశతో సాగు పెంచారు. సెప్టెంబర్‌లో మిర్చి వేయగా ఇప్పుడిప్పుడే పంట చేతికి వస్తున్నది. ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టారు. తెగుళ్ల బెడద, వాతావరణం అనుకూలించకపోవడంతో మరో రూ.20 వేల వరకు ఖర్చు అయినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని ఆశ పడ్డప్పటికీ 15 క్వింటాళ్లు కూడా రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి అమ్ముకోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అమ్ముకోవడానికి అవస్థలే..

భైంసా, ధర్మాబాద్, భోకర్, ఖమ్మం, వరంగల్ మార్కెట్‌లకు మిర్చిని తీసుకెళ్లి అమ్ముకోవాల్సి వస్తున్నది. వరంగల్ మార్కెట్ 400 కిలోమీటర్లు.. భోకర్, ధర్మాబాద్ మార్కెట్ 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. భైంసాలో మార్కెట్ ఉన్నా ధర లభించడం లేదు. ప్రారంభంలో క్వింటాలుకు రూ.22 వేల ధర లభించినప్పటికీ.. నెల రోజుల్లోనే రూ.8 వేలు తగ్గింది. ప్రస్తుతం రూ.12 వేలకే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రవాణా ఖర్చులు కూడా తడిసి మోపెడు అవుతున్నాయి. దీంతో మిర్చి అమ్ముకోలేక, నిల్వ ఉంచుకోలేక అవస్థలు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జోక్యం చేసుకుని మార్కెట్ సౌకర్యం, ధర లభించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

### రూ.8 వేలు తగ్గింది..



ఐదెకరాల్లో మిర్చి సాగు చేసిన. రూ.8 లక్షల వరకు పెట్టుబడి పెట్టిన. ఇప్పుడిప్పుడే పంట చేతికొస్తున్నది. ప్రారంభంలో రూ.20 వేలు ఉండే. ఇప్పుడు రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నారు. ధర లభించకపోవడంతో గిట్టుబాటు కూడా రావడం లేదని ఆవేదన చెందుతున్నారు. విత్తనాలు, ఎరువులు, రసాయనిక మందులు, కూలీ రేట్లు పెరిగినా ధర మాత్రం పెరుగకపోవడంతో పెట్టుబడి వస్తే చాలు అనిపిస్తున్నది. ప్రభుత్వం మిర్చి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి.

**- ఫారూక్, రైతు, ఓల.**

### ఖమ్మం, వరంగల్ మార్కెట్‌కు తీసుకెళ్తున్నా..



స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో అమ్ముకోవడానికి ఖమ్మం, వరంగల్ మార్కెట్‌లకు తీసుకెళ్లా. నాణ్యత పేరిట క్వింటాలుకు రూ.15 వేలకు మించి ఇవ్వలేదు. రవాణా ఖర్చులకే రూ.10 వేలు అయ్యాయి. గతేడాది మాదిరిగా మిర్చికి లాభం వస్తుందని ఆశపడ్డాం. కానీ.. నిరాశే ఎదురైంది. లాభాలు ఏమో కానీ.. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. స్థానిక మార్కెట్‌లోనే మద్దతు ధర చెల్లించి రైతులను ఆదుకోవాలి.

**- నర్సింలు, రైతు.**



సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లా అధికారులు





మాట్లాడుతున్న డీఎస్సీడీవో భగత్ సునీతాకుమారి

## ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాలి..

- పది విద్యార్థుల మానసిక స్థితిని దృష్టిలో ఉంచుకోవాలి..
- సందేహాలు నివృత్తి చేస్తూ వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలి..
- డీఎస్సీడీవో భగత్ సునీతాకుమారి, డీబీసీడీవో రాజలింగు

ఎదులాపురం, ఫిబ్రవరి 27 : పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత వసతి గృహ సంక్షేమ అధికారులపై ఉందని డీఎస్సీడీవో భగత్ సునీతాకుమారి, డీబీసీడీవో రాజలింగు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల ఎస్సీ, బీసీ ఏఎస్‌డబ్ల్యూవో, వసతి గృహాల సంక్షేమ అధికారులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల మానసిక స్థితిని దృష్టిలో పెట్టుకుని మెలగాలన్నారు. సందేహాలను నివృత్తి చేస్తూ వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మర్రి చెన్నారెడ్డి హెచ్‌ఆర్డీ రీజినల్ మేనేజర్ ప్రభాకర్, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేశ్, ఉమ్మడి జిల్లాల ఏఎస్‌డబ్ల్యూవోలు, వసతి గృహాల సంక్షేమ అధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లు కిరణ్ కుమార్, ప్రదీప్, శ్రీకాంత్ ఉన్నారు.

## మొక్కులు చెల్లించుకున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 27 : మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో కేస్లాపూర్ గ్రామానికి చెందిన మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం కేస్లాపూర్ గ్రామ పటేల్, మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, నాగోబా ఆలయ పూజారి మెస్రం షేక్ ఆధ్వర్యంలో ఇంద్రాదేవి ఆలయంలో సంప్రదాయం ప్రకారం మొక్కులు చెల్లించారు. ఇంద్రాదేవితోపాటు దేవి జెండా వద్ద నైవేద్యాలు పెట్టారు. నాగోబా జాతర ముగిసిన తరువాత ఇంద్రాదేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయులు బాదిరావ్‌పటేల్, చిత్రుపటేల్ పాల్గొన్నారు.



ఇంద్రాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు



కుంటాల పీఏసీఎస్ చైర్మన్ గజ్జారాంను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

## పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం వెనక్కి..

భైంసాటౌన్, ఫిబ్రవరి 27 : కుంటాల పీఏసీఎస్ చైర్మన్ గజ్జారాంపై అవిశ్వాస తీర్మానాన్ని మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సూచన మేరకు వెనక్కి తీసుకుంటున్నట్లు పీఏసీఎస్ డైరెక్టర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలుపుతూ విఠల్‌రెడ్డి దేగాంలోని తన నివాసంలో గజ్జారాంను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్, డైరెక్టర్‌లు మాట్లాడుతూ.. మేము ఎల్లప్పుడు బీఆర్ఎస్, విఠల్‌రెడ్డి వెంటనే ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ బుచ్చన్న, ఆత్మ చైర్మన్ అశోక్ రెడ్డి, సీనియర్ నాయకులు ఖదీర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లావణ్య, నర్సాపూర్ వైస్ ఎంపీపీ సుధాకర్, డైరెక్టర్‌లు గజ్జారాం, శివరాం, గోనె గజ్జారాం, లక్ష్మి పురుషోత్తం, సంతోష్, పాండు నాయక్ పాల్గొన్నారు.

## ఆపదలు తొలిగిపోవాలని..

సోన్, ఫిబ్రవరి 27 : నిర్మల్ మండలంలోని ముజ్గి మల్లన్న జాతరలో భాగంగా ఐదో రోజైన మంగళవారం అగ్నిగుండ ప్రవేశంతో ముగిసింది. ఐదు రోజులుగా నిర్వహిస్తున్న జాతరలో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి మొక్కులను చెల్లించుకున్నారు. వేకువజామున నిప్పురవ్వలపై నుంచి నడిచి తమ ఆపదలు తొలిగిపోవాలని మొక్కుకున్నారు. అగ్నిగుండంలో నుంచి నడిచేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అగ్నిగుండం నుంచి నడుస్తున్న భక్తులు

## సోయాను కొనుగోలు చేయాలి..

- రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది..
- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రహ్లాద్

ఎదులాపురం, ఫిబ్రవరి 27 : రైతులు పండించిన ప్రతి పంటను కేసీఆర్ ప్రభుత్వం కొనుగోలు చేసిందని, అదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్ డిమాండ్ చేశారు. మాజీ మంత్రి జోగు రామన్న ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా మార్కెట్ యార్డులో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల దృష్ట్యా మార్కెట్ యార్డ్‌ను సందర్శించామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులు సోయాబీన్ కొనుగోలు చేస్తున్నామని అబద్ధాలు ఆడుతున్నారని మండిపడ్డారు. బుధవారం వరకు మద్దతు ధరకు కొనుగోలును ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనియెడల ధర్నా చేస్తామని హెచ్చరించారు. అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి వినతి పత్రం సమర్పించారు. ఆయన వెంట ఎంపీపీ గంద్రత్ రమేశ్, జిల్లా సమన్వయ సమితి అధ్యక్షుడు రోకండ్ల రమేశ్, బీఆర్ఎస్ నాయకులు కుమ్ర రాజు, సేవ్వా జగదీష్, రాజన్నలు ఉన్నారు.



మార్కెట్ యార్డ్‌లో ఆందోళన చేస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, బీఆర్ఎస్ నాయకులు

## మాయమాటలు చెప్పి.. మత్తు మందు స్ప్రే చేసి..

### రూ.60 వేలు దోచుకుని పరారైన దంపతులు

భైంసాటౌన్, ఫిబ్రవరి 27 : భైంసా మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన ఠాగూర్ అవినాశ్ దాబా నడుపుతున్నాడు. మంగళవారం ఉదయం కూరగాయల కోసం భైంసా పట్టణానికి వెళ్లాడు. ఇంటికి వస్తుండగా అవసరం నిమిత్తం దారిలో ఉన్న ఏటీఎం నుంచి రూ.40 వేలు డ్రా చేసుకున్నాడు. అతని వద్ద ఇంటి నుంచి తీసుకచ్చుకున్న రూ.20 వేలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో అవినాశ్ మాటేగాం టోల్‌ప్లాజా వద్దకు రాగానే.. ద్విచక్ర వాహనంపై వచ్చిన దంపతులు నిర్మల్‌కు ఎలా వెళ్లాలని అడిగారు. అవినాశ్ చెబుతుండగానే వారి వద్ద ఉన్న స్ప్రేను దంపతుల ముఖంపై కొట్టారు. దంపతులు ఇద్దరు స్పృహ కోల్పోయారు. వారి వద్ద ఉన్న రూ.60 వేలు తీసుకుని పారిపోయారు. కోలుకోగానే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ జిల్లా అధికారి జయంత్‌రావు చౌహాన్

## కోతల్లేకుండా చూడాలి..

### జిల్లా విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజినీరు జయంత్‌రావు చౌహాన్

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 27 : నిర్మల్ జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు విద్యుత్ సరఫరా జరిగేటట్లు చూడాలని, సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజినీరు జయంత్‌రావు చౌహాన్ అన్నారు. విద్యుత్‌శాఖ కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహించేవారు సాంకేతిక లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గృహలక్ష్మి పథకంలో భాగంగా 200 యూనిట్లు వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా అమల్లోకి వచ్చిందని, దీనిని సక్రమంగా అమలు చేయాలని సూచించారు. జిల్లాలో సుమారు 64 వేల మంది అర్హులు ఉన్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ అధికారులపై వినియోగదారులు దురుసుగా ప్రవరిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సిబ్బంది తప్పు చేస్తే తమ దృష్టికి తేస్తే సరిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ నాగరాజు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ఖానాపూర్ రూరల్, ఫిబ్రవరి 27 : మండలంలోని మస్కాపూర్‌లో నూతన శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గణపతి పూజ, ధ్వజ స్తంభ సంస్కారము, నవచండీ పరాయణం, సామూహిక కుంకుమార్చన, మంత్ర హోమాలు నిర్వహించారు. రాయితో తయారు చేయించిన ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. శివాలయంలో ఉత్సవాలు నేటి(బుధవారం) వరకు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగమ్మ పాల్గొన్నారు.

## భూసేకరణ కేసులను పరిష్కరించాలి..

### నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 27 : ప్రభుత్వ శాఖలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ కేసులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో భూసేకరణ పెండింగ్ కేసులు, తీర్పు వచ్చిన కేసులు, విచారణలో ఉన్న కేసుల గురించి తెలుసుకున్నారు. కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పెండింగ్ లేకుండా చూసుకోవాలని, భూసేకరణలో భూములు కోల్పోయిన వారికి న్యాయం జరిగేటట్లు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్వో లింగయ్య, నీటి పారుదల శాఖ జిల్లా అధికారి సుశీల్‌కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ అశోక్‌లు పాల్గొన్నారు.

## 29న విగ్రహాల ప్రతిష్ఠాపన

### నూతన ఆలయంలో ప్రారంభమైన ప్రత్యేక పూజలు



గర్భ గుడిలో ప్రతిష్ఠించనున్న నంది శివలింగం

జైనథ్, ఫిబ్రవరి 27 : జైనథ్ మండలంలోని కొరటలో నూతనంగా నిర్మించిన ఓంకారేశ్వర ఆలయంలో శివ, పార్వతులు, గణపతి, లక్ష్మి, నాగశేషుడి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాల కోసం మంగళవారం పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దుబే సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో గోపూజ, గురు వందనం, గణపతి పూజ, మంగళ హారతి, జలారి వాసం వంటి పూజలు నిర్వహించారు. ఈనెల 29వ తేదీన గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.